ప్రజాశక్తి

సోమవారం 7 జూలై 2025

5

అల్లూరి సీతారామరాజు



సిసి రోడ్డు నిర్మించాలి: సిపిఎం

ప్రజాశక్తి -దుంబ్రిగుడ:గసబ పంచాయతీ మొర్రిగుడ గ్రామానికి సిసి రోడ్డు నిర్మాణం చేపట్టాలని సిపిఎం పార్టీ మండల నాయకులు, గసబ పంచాయతీ మాజీ సర్పంచ్ పాంగి సురేష్ కుమార్ డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హాయంలో సుమారు రూ 58లక్షల రూపాయలు తారు రోడ్డుకు మంజూరైందనీ, అధికారులు, ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా కాంట్రాక్టర్ కు బిల్లులు నిలిచి పోవడంతో రోడ్డు నిర్మాణం పూర్తి కాలేదని వాపోయారు. ఈ విషయంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ దృష్టికి తీసుకొని వెళ్ళడం జరిగిందని చెప్పారు. అరకు నియోజకవర్గం ఎమ్మెల్యే దృష్టికి కూడా తీసుకొని వెళ్ళడం జరిగిందని చెప్పారు. అయినా రోడ్డు నిర్మాణం పూర్తి కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు బాగు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనీ ఆవేదన వ్యక్తం చేశారు. అనారోగ్యంకు గురైనప్పుడు అంబులెన్సు రాలేని పరిస్థితి ఉందని చెప్పారు. ఈ సమావేశంలో వార్డ్ మెంబెర్స్ పాంగి. సత్యనారాయణ, వంతాల. ఆనందరావు, మాజీ వార్డ్ మెంబర్ వంతాల. మొస్యా, పంచాయతీ నాయకులు సుబ్బారావు, బాస్కరరావు, క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

గ్రామసభ తీర్మానం లేకుండా..

హైడ్రో ప్రాజెక్టుకు అనుమతులు తగవు

ఆదివాసీ గిరిజన సంఘం నేతల నిరసన



ముంచంగిపుట్టులో కాపీలను దగ్ధం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు : హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌కు గ్రామసభ ఆమోదం లేకుండా అనుమతులను ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ మండలంలోని బంగారు మెట్ట గ్రామ పంచాయతీ మాలగుమ్మి గ్రామంలో ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి కొర్ర నరసయ్య ఆధ్వర్యంలో ఆదివారం జీవో 51 కాపీలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనంతగిరి మండలంలో పెద్దకోటలో అదానీ కంపెనీ హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణాలకు స్థానిక గ్రామాల ఆదివాసులతో కనీస గ్రామసభ కూడా పెట్టలేదన్నారు. ఏకపక్షంగా రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు ఇస్తూ జిఒ నెంబర్ 51 ఉత్తర్వులు జారీ చేయడంపై ఆగ్రహించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోని తక్షణమే రద్దు చేయాలనీ ప్రభుత్వాన్ని కోరారు. పెద్దకోట గ్రామ సమీపంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు 1800 మెగా వాట్స్‌కు పెంచడమే కాకుండా, స్థానిక వాగు నుంచి 16.54 ఎంసీఎం నీటిని తరలించడానికి కూడా అనుమతి ఇవ్వడం దుర్మార్గమన్నారు.షెడ్యూల్డ్ ప్రాంతంలో 1/70 చట్టం, అటవీ హక్కుల చట్టం, పెసా వంటి చట్టాలు ఉన్నప్పటికీ అనుమతులు ఇవ్వడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా అనుమతులు జారీ చేసిందని విమర్శించారు. వాగుల నుంచి నీటిని ప్రాజెక్టుకు తరలించడంతో ఆదివాసులకు అపారమైన నష్టం జరుగుతుందని తెలిపారు. ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు కొర్రా శ్రీను, చందు, దేవన్న, చంద్రయ్య పాల్గొన్నారు.

దుంబ్రిగుడ : హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అనుమతులు రద్దు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. మండలంలోని కాంద్రుం పంచాయతీ జాకరావలస గ్రామంలో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో 51 జీ ఓ కాపీలు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి.సూర్యనారాయణ మాట్లాడుతూ, అనంతగిరి మండలం పెద్దకోట గ్రామ పంచాయతీలో ఆదానీ కంపెనీ హైడ్రో పవర్ ప్రాజెక్టుకు పెసా గ్రామ సభకు సంప్రదించకుండా ఏక పక్షంగా అనుమతులు ఇస్తూ జీఓ నెం.51 ఉత్తర్వులు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ 51 తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు,కె రామచందర్, వి.రాజు, కె.భాస్కరరావు, జగత్ కె రుకుదార్ పాల్గొన్నారు.



చేపడుతున్న రోడ్డు పనులు

హైవే రోడ్డుకు మరమ్మతులు

-ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని కొంతిలి కాలనీ నుంచి రాళ్లగడ్డ వరకు నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారి ఎన్‌హెచ్-516ఈలో నాణ్యత లోపాలపై అధికారులు స్పందించారు. ప్రజాశక్తి పత్రికలో ఈనెల 4వ తేదీన "హైవే నిర్మాణం నాణ్యత లోపం."రోడ్డు పూర్తి కాకముందే పగుళ్లు" అనే శీర్షికతో కథనం ప్రచురించబడింది. ఈ కథనానికి స్పందనగా, హైవే నిర్మాణాన్ని నిర్వహిస్తున్న కాంట్రాక్టర్ శనివారం నుంచి రోడ్డు మరమ్మతు పనులను ప్రారంభించారు. నూతనంగా నిర్మించిన బ్రిడ్జి రెండువైపులా, పెదగరు గ్రామ సమీపంలోని పగుళ్లు ఏర్పడిన ప్రాంతాల్లో మరమ్మతులు చేపడుతున్నారు. హైవే నిర్మాణంలో రోడ్డు పగుళ్లతో దెబ్బతినడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండో ఎఎన్ఎంల సమస్యలు పరిష్కరించండి

- సిఐటియు జిల్లా అధ్యక్షుడు చిన్నయ్య పడాల్ డిమాండ్

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి ఏజెన్సీలో వైద్య ఆరోగ్యశాఖ ద్వారా గ్రామాల్లో ప్రజలకు దీర్ఘకాలంగా సేవలందిస్తున్న సెకండ్ ఏఎన్ఎంల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సిఐటియు డిమాండ్ చేసింది . జిల్లా కేంద్రం పాడేరులో సిఐటియు కార్యాలయంలో ఆదివారం జరిగిన రెండవ ఏఎన్ఎంల సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు బొనంగి చిన్నయ్య పడాల్ పాల్గొని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు ఏఎన్ఏంలు పలు సమస్యలు తెలియ పరిచారు. గత 15 సంవత్సరాలుగా గిరిజన ప్రాంతంలోని అతి మారుమూల గ్రామాలకు ఆదివాసి ప్రజానీకానికి క్షేత్రస్థాయిలో వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. రెగ్యులర్ ఏఎన్ఎం మాదిరిగానే కష్టపడుతున్నామని, అయినప్పటికీ ప్రభుత్వం రెండవ ఏఎన్ఎంలకు జీతాలు పెంచలేదన్నారు. రెగ్యులర్ చేసి ఏ ఎన్ఎంలకు ఇస్తున్న ఎలవెన్సు కూడా తమకు ఇవ్వలేదన్నారు. యూనియన్ నాయకుల ముందు తమ గోడును తెలియపరచుకున్నారు. ఈ సందర్భంగా చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా క్షేత్రస్థాయిలో వైద్య ఆరోగ్య సేవలు అందిస్తున్న రెండవ ఏ . ఎన్, ఎంలకు సమాన పనికి సమాన వేతనం కల్పించాలని డిమాండ్ చేశారు. ఐటీడీఏ పరిధిలో ఖాళీగా ఉన్న ఏఎన్ఎం పోస్టుల్లో వారిని కాంటాక్ట్ పద్ధతి పై నియమించాలని, ఎలవెన్స్ లను రెండవ ఏ ఎన్. ఎం లకు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. భవిష్యత్తులో ఏజెన్సీ ప్రాంతంలో రెగ్యులర్ ఏఎన్ఎంల పోస్టులు నియామకాలు చేపడితే రెండవ ఏఎన్ఎంల లకు ప్రాధాన్యత కల్పించాలని ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు రెండవ ఏఎన్ఎంలకు తాత్కాలిక కమిటీని ఏర్పాటు చేశారు. సిఐటియు జిల్లా నేతలు సుందర్‌రావు, నాగరాజు, రెండవ ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



హుకుంపేట మండలం కోటగుమ్మం పాఠశాలలో వర్షానికి గొడుగులు పట్టుకుని నిలుచున్న విద్యార్థులు

శిథిలావస్థలో పాఠశాలలు

-వర్షాలకు తరగతి గదుల్లో చేరుతున్న నీరు - అవస్థలు పడుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని బాకూరు పంచాయతీలోని కోటగుమ్మం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్)లో 28 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ వర్షాకాలంలో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. వర్షాలు కురుస్తుండడంతో తరగతి గదుల్లో నీరు చేరుతోంది. నేలపై కూర్చుని చదవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాఠశాలపై స్లాబు పై పెచ్చులు ఊడి పడుతున్నాయి. వర్షం పడిన ప్రతి రోజూ గదుల్లో నీరు చేరుతుండటంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల అభివృద్ధికి "నాడు- నేడు" పథకంలో నిధులు మంజూరు అయినప్పటికీ, నిర్మాణ పనులు ఇప్పటివరకు ప్రారంభం కాలేదని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇలాంటి శిథిల పాఠశాలలో చదవడం కన్నా క్షేమంగా ఇంట్లో ఉండడం మంచిది" అని ఒక తల్లి వ్యాఖ్యానించారు. అధికారులు స్పందించి వెంటనే నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతున్నారు.గ్రామస్తులు లక్ష్మణ్,ప్రకాష్ మాట్లాడుతు రోజు కురుస్తున్న వర్షాలతో విద్యార్థులు చదుకోవడం కష్టంగా ఉందన్నారు.

చింతపల్లి: మండలంలోని లోతుగడ్డ పంచాయతీ పరిధిలోని చౌడురాయి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరుకొంది. దీంతో, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 32 మంది విద్యార్థులు ఈ పాఠశాలలో చదువుకుంటున్నారు. వర్షాలకు తరగతి గదుల లోపల వర్షపు నీరు చేరుతోంది. వర్షం నుంచి రక్షణగా తాత్కాలికంగా పైకప్పును పాలిథిన్ షీట్(టార్పిన్ కవర్) వేశారు. 1998లో నిర్మితమైన ఈ భవనం అప్పటి నుండి మరమ్మతులు చేయలేదు. ఎన్నో సార్లు విజ్ఞప్తులు చేసినా అధికారులు పట్టించుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశ్నారు.

పాఠశాలల అభివద్ధిపై ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు కనీసం ఇప్పటికైనా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.



చింతపల్లి మండలం చౌడురాయి పాఠశాలపై కప్పుతున్న టార్పాలిన్



స్వల్పంగా తగ్గిన గోదావరి నీటిమట్టం

ప్రజాశక్తి - ఎటపాక: భద్రాచలంలో శనివారం 20 అడుగుల వద్ద ఉన్న గోదావరి వరద నీటి మట్టం ఆదివారం 19 అడుగులకు చేరుకుంది. వరద కొంతమేర తగ్గినప్పటికీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గోదావరి వరద మళ్లీ పెరిగే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వరద నీటిలోకి దిగరాదని, చేపలవేటకు వెళ్లరాదని హెచ్చరించారు.



మాట్లాడుతున్న లోతారామారావు



సమావేశానికి హాజరైన గిరిజనులు

ఆదివాసీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి

ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు

ప్రజాశక్తి - చింతూరు : కేంద్రంలోని బిజెపి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలు ఆదివాసీ హక్కులు, చట్టాలు అమలుపై నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తున్నాయని ఫలితంగానే ఏజెన్సీలో ఆదివాసీల అభివృద్ధి కుంటు పడిందని ఆదివాసీల హక్కులను పటిష్టంగా అమలు చేసి న్యాయం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు డిమాండ్ చేశారు. ఆదివారం చింతూరు ఎనిమిదో మండల మహాసభ లక్కవరం గ్రామంలో నిర్వహించారు. ఘట్టం కన్నయ్యనగర్ నందు మొట్టు రాజయ్య, వేకా రాజ్‌కుమార్, సోడి చిన్నమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘ రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి 11 ఏళ్ల గా ఆదివాసీ హక్కులను, చట్టాలను అమలులో నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తూ కార్పొరేట్లకు ఏజెన్సీ పీసా చట్టం అనుమతి లేకుండా దౌర్జన్యంగా ఏజెన్సీ ఖనిజ సంపదను దోచి పెట్టేందుకు ప్రయత్నిస్తోందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం టైగర్ జోన్ పేరుతో ఏజెన్సీ గ్రామాలను ఖాళీ చేయించాలనే కుట్ర చేస్తున్నారని దీనిపై ఆదివాసులు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల సందర్భంగా జిఒ నంబర్ 3 అమలు చేసి 100 శాతంఉద్యోగాలను ఆదివాసీలతోనే భర్తీ చేస్తానన్న ముఖ్యమంత్రి చంద్రబాబు వాగ్దానాన్ని తుంగలోకి తొక్కారన్నారు. ఆదివాసి చట్టాల అమలుకు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్ మాట్లాడుతూ ఆదీవాసులకు రెండో పంటగా ఉన్న తునికాకు సేకరణపై కూడా నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారని గత కొంతకాలంగా తునికాకు సేకరణ చేసిన కార్మికులకు డబ్బులు కార్మికులు ఆందోళన చేస్తే తప్ప ఇచ్చే పరిస్థితి లేదని అంతేకాకుండా 2002 నుండి తునికాకు బోనస్ పెండింగ్ ఉంటే 2021 బోనస్‌ను మాత్రమే కొంతమంది కార్మికులకు ఇచ్చిన పరిస్థితి ఉందన్నారు. పోలవరం ముంపు బాధితుల్లో నేటికీ భూములకు పరిహారం చెల్లించే శ్రద్ధకనిపించడం లేదన్నారు. తమ సమస్యల పరిష్కారానికి రానున్న రోజుల్లో ఆదివాసీలంతా కలసికట్టుగా కృషి చేయాలన్నారు. చింతూరు మండల మహాసభలో రాబోయే ఉద్యమ కార్యచరణను ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి పల్లపు వెంకట్, గిరిజన సంఘ రాష్ట్ర నాయకులు సీసం సురేష్ మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధిలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి విడనాడాలని మౌలిక సౌకర్యాలు కల్పించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు

మండల గిరిజన సంఘం నూతన కమిటీ

చింతూరు మండలంలో 17 మందితో కార్యవర్గ కమిటీని ఎన్నుకొనడం జరిగింది. కార్యదర్శి వర్గంగా ఏడుగురు సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా కారం నాగేష్, ముట్టం రాజయ్య ఎన్నికయ్యారు ఉపాధ్యక్షులుగా వ్యాకా రాజ్‌కుమార్, పాండు నాగార్జున, సహాయ కార్యదర్శులుగా కలుముల మల్లేష్, షోడే చిన్నమ్మిను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో స్థానిక గిరిజన సంఘం నాయకులు మడకం చిన్నయ్య, కోసం వీరయ్య మహిళా సంఘం నాయకులు గుర్రం రంగమ్మ, పట్టా రాములమ్మ, మడివి శ్రీదేవి, ధర్మల వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక డైవర్షన్ నిలిచేనా ?



అన్నవరం వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక డైవర్షన్

ప్రజాశక్తి - విఆర్‌పురం: మండలంలోని అన్నవరం తాత్కాలిక డైవర్షన్ వర్షాలు కురిస్తే వాగు ఉధృతికి నిలిచేనా అనే సందేహాలు అందరినీ వేధిస్తున్నాయి. ప్రస్తుతం అన్నవరం ఉమ్మడివరం గ్రామాల మధ్య ఏర్పాటు చేసిన తాత్కాలిక డైవర్షన్ ద్వారానే రాకపోకలు సాగిస్తున్నారు. జూలై, ఆగస్టులో భారీ వర్షాలు కురిస్తే వాగు ఉధృతికి డైవర్షన్ నిలిచే అవకాశం లేదు. గత ఏడాది వేసిన సిమెంట్ నందలు ప్రవాహానికి కొట్టుకుపోయాయి. దీంతో వాహనదారులు అనేక అవస్థలు ఎదుర్కొన్నారు. బ్రిడ్జి కూలి పోయి ఐదేళ్లు అవుతున్నా ఇప్పటివరకు తాత్కాలిక డైవర్షన్ స్థానంలో నూతన వంతెన నిర్మాణం చేపట్టలేదు ఇప్పటికైనా వంతెన శాశ్వత నిర్మాణానికి చర్యలు చేపట్టాలని గిరిజన ప్రజలు కోరుతున్నారు.

టిడిపి నియోజకవర్గ పరిశీలకునిగా శ్రీనివాస్



శ్రీనివాస్ యాదవ్

ప్రజాశక్తి - రంపచోడవరం : రాష్ట్రంలోని నియోజకవర్గాల అబ్జర్వర్లను నియమిస్తూ కేంద్ర కార్యాలయం జాబితాలను విడుదల చేసింది. ఈ జాబితాలో అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గ టిడిపి అబ్జర్వర్‌గా కాకినాడ జిల్లా బిసిసెల్ జనరల్ సెక్రటరీ కొల్లుబోయిన శ్రీనివాస్ యాదవ్‌ను నియమిస్తున్నట్టు తెలిపింది. శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి ఆధ్వర్యంలో నియోజకవర్గ అబ్జర్వర్‌గా తన విధులను సక్రమంగా నిర్వహిస్తానని తెలిపారు.

8న హార్టీకల్చర్ ప్లాంటేషన్

ప్రజాశక్తి - కొయ్యూరు : ఈ నెల 8వ తేదీన కొయ్యూరు మండలంలోని 33 పంచాయతీల్లో 'వన్ డే క్యాంపెయిన్ ప్రోగ్రాం ఆన్ హార్టికల్చర్ ప్లాంటేషన్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ప్రసాదరావు ఆదివారం తెలిపారు. ఉపాధి పథకం ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మంజూరైన ప్లాంటేషన్ పనులను చేపడతామన్నారు. కార్యక్రమంలో మండలంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.



పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

చోరీలపై అప్రమత్తత

ప్రజాశక్తి -సీలేరు: చోరీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్సై రవీంద్ర వెల్లడించారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అత్యవసరమైతే తప్ప రాత్రి 11 దాటిన తర్వాత గ్రామంలో ఎవరూ సంచరించరాదని హెచ్చరించారు. ఇటీవల సీలేరులో బైక్ చోరీలు జరుగుతున్నాయని ప్రతి ఒక్కరు గమనించాలన్నారు. బైక్‌లను మీ ఇళ్లల్లో భద్రపరుచుకోవాలని సూచించారు. ప్రతిరోజు సీలేరులో రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తూ తనిఖీలు ముమ్మరం చేస్తున్నామని తెలిపారు. అపరిచిత వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకు మార్కెట్, ఎపి జెన్‌కో కాలనీ తదితర ప్రదేశాల్లో సిఆర్‌పి బలగాలను మోహరించి నైట్‌పెట్రోలింగ్ కట్టుదిట్టంగా నిర్వహిస్తామని తెలిపారు.

క్రికెట్ టోర్నీ విజేత లొద్దిపాలెం జట్టు

ప్రజాశక్తి - రంపచోడవరం : మండలం సీతపల్లిలో గ్రామస్తుల సహకారంతో సోదే వినోద్‌కుమార్, ధర్మకుమార్ (దాస్) నిర్వాహకులుగా వ్యవహరించిన క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. గత నెల ఆరో తేదీ నుంచి జరుగుతున్న టోర్నమెంట్‌లో వివిధ మండలాలకు చెందిన 46జట్లు పాల్గొన్నాయి. ఫైనల్‌కు లొద్దిపాలెం, దేవీపట్నం జట్లు చేరుకోగా ఆదివారం జరిగిన ఫైనల్‌లో లొద్దిపాలెం జట్టు విజేతగా నిలిచింది. విజేతగా నిలిచిన జట్టుకు రూ.10,000, రన్నర్‌గా నిలిచిన దేవీపట్నం జట్టుకు రూ.5వేలు రంపచోడవరం నియోజక వర్గం వీరమహిళ పండా వరలక్ష్మి, టిడిపి సీనియర్ నాయకులు కుంజం బాపన్నదొర అందజేశారు. క్రీడలను ప్రోత్సహించే ఉదేశ్యంతో రెండు ఎకరాల స్థలాన్ని గ్రామస్తులు కుంజం బాపన్నదొర, కొమరం రామన్నదొర యువకులకు అందజేశారు. గ్రామపెద్దలు తీసుకొన్న చొరవకు యువత వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బందం సత్యనారాయణదొర, బొరగా బాలుదొర, కలుం తమ్మన్న దొర, బందం వీరయమ్మ తదితరులు పాల్గొన్నారు.



విజేత జట్టుకు బహుమతి అందిస్తున్న పండా వరలక్ష్మి

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

పాడేరులో బైక్ యాత్ర



పాడేరులో ర్యాలీ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి -యంత్రాంగం

పాడేరు:- పని గంటల పెంపుతో కార్మికులను శ్రమ దోపిడీకి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్నాయని సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ విమర్శించారు. జులై 9న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మె జయప్రదానికై పాడేరులో ఆదివారం బైకు యాత్ర నిర్వహించారు. జిసిసి కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ఈ యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, చికాగో నగరంలో జరిగిన పోరాటంలో 8 గంటల పని దినం సాధించడం జరిగిందని, ఇప్పుడు ఈ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర కేబినెట్ సమావేశంలో 10 గంటలకి పెంచుతూ తీర్మానం చేసిందని మండిపడ్డారు. అదనంగా రెండు గంటలు పెంచడం అంటే కార్మికుల శ్రమను దోచుకోవడమేనన్నారు. నాలుగు లేబర్ కోడ్స్ కు వ్యతిరేకంగా కార్మికులు నిరసన తెలియజేయాలన్నారు. లేబర్ కోడ్స్ అమలయితే కార్మిక వర్గం బానిస బతుకుల్లోకి వెళ్తుందన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు చెల్లింపు, పిఎఫ్ ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి కార్మికుడు స్వచ్ఛందంగా వచ్చి సమ్మెలో పాల్గొవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మెడికల్ హెల్త్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి. నాగరాజు, లక్ష్మణ్, సమగ్ర శిక్ష జేఏసీ నాయకులు జయరాజ్, కార్మికులు గౌరి నాయుడు,దేముడు, ఆసుపత్రి కార్మికులు నగేష్,చిట్టిబాబు, కొండబాబు, బొజ్జన్న, సిఐటియు జిల్లా సహయ కార్యదర్శి లింగేరి సుందరరావు. పాల్గొన్నారు.

ఎటపాక: నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని దేశ వ్యాప్తంగా ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్న సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు మండల అధ్యక్షుడు జి.హరనాథ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బుక్‌లెట్‌లను మండలంలోని కార్మికులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల అధ్యక్షులు హరినాథ్ మాట్లాడుతూ దశాబ్దాలుగా కార్మికులు పోరాడి సాధించుకున్న అనేక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్‌కోడ్లను తీసుకొచ్చిందన్నారు. దీని ద్వారా కార్మికులకు ప్రశ్నించే హక్కు, పోరాడే స్వేచ్ఛ ఉండవని, పని గంటల పెరిగి కార్మికులు వెట్టి చాకిరీ చేయాల్సి వస్తుందన్నారు. 9న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు తోట శ్రీను, భవననిర్మాణ కార్మికులు శేఖర్, రవి, ఇరపా వెంకటేష్, ఆటో కార్మికులు నరేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎటపాకలో బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు



హుకుంపేటలో కుక్కకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్యాధికారి

పెంపుడు జంతువులకు టీకాలు

ప్రజాశక్తి- హుకుంపేట:మండలంలోని బాకూరు పశువైద్యశాల పరిధిలో హుకుంపేట పశువైద్యాధికారి కె.చరణ్ ఆదివారం జూనోసిస్ డేను పురస్కరించుకుని టీకాలను వేశారు. ఈ సందర్భంగా మండల పరిషత్ వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు మాట్లాడుతూ, కుక్క కాటుతో కలిగే రేబిస్ వ్యాధిపై ప్రముఖ శాస్త్రవేత్త లూయి పాశ్చర్ టీకాను కనుగొన్నారని, ఆయన సేవలను స్మరించుకుంటూ జూనోసిస్ డేగా గుర్తిస్తారన్నారు. ఏనిమల్ హస్బెండ్రి అసిస్టెంట్ పాంగి సన్యాసి రాజు మాట్లాడుతూ, పెంపుడు జంతువులకు టీకాలు వేయించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గన్నేరు పుట్టు మాజీ సర్పంచ్ సూడిపల్లి లక్ష్మీ ప్రమీల, బాకూరు నాయకులు శరభ క్రాంతి రాజు, ఆఫీస్ సబ్ ఆర్డినేట్ ప్రవీణ్ కుమార్, పశువైద్య సిబ్బంది పాంగి సన్యాసిరాజు, పాంగి దొన్ను, సీ హెచ్ శేఖర్, పాడి బాలన్న, రేగం బుజ్జిబాబు పాల్గొన్నారు.

అనంతగిరి:ప్రపంచ జూనోసిస్ దినోత్సవంను పురస్కరించుకుని కాశీపట్నం, అనంతగిరి పశువైద్యశాలలో 68 పెంపుడు కుక్కలకు ర్యాబీస్ వ్యాధి నివారణ టీకాలు వేశామని వైద్యులు జ్ఞానేశ్వర్ రావు బి. సందీప్ లు తెలపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మనుషులకు సోకే జూనోటిక్ వ్యాధులు ముఖ్యంగా ర్యాబీస్, ఆంత్రాక్స్‌పై అవగాహన అవసరమని తెలిపారు. ర్యాబీస్ వ్యాధి వైరస్ వల్ల సోకే ప్రాణాంతక వ్యాధి అన్నారు. జంతువుల నుండి మనుషులకు సోకే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి క్రమం తప్పకుండా పెంపుడు కుక్కలకు ర్యాబీస్ వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పినకోట గ్రామీణ పశు వైద్య కేంద్రం జూనియర్ వెటర్నరీ అధికారి శ్రీనివాస్. సచివాలయ పశుసంవర్ధక సహాయకులు పాల్గొన్నారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-చింతపల్లి:తొలి ఏకాదశిని పురస్కరించుకొని స్థానిక రామాలయం ఆలయంలో భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు శ్రీరాముని సన్నిధిలో పసుపు, కుంకుమ, పూలు సమర్పిస్తూ ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు తీర్థ ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి -చింతపల్లి: పచ్చకామెర్ల వ్యాధి బారిన పడి చింతపల్లి మండలానికి చెందిన ఉపాధ్యాయుడు రౌతుల విష్ణుమూర్తి మృతి చెందారు. చుంచుంపూడి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న ఆయన గత కొన్ని రోజులుగా పచ్చకామెర్లతో బాధపడుతున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు, కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు.

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో మహిళ మెడలో బంగారం చోరీచేసిన వ్యక్తిని నేరవిభాగం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు నేరవిభాగం సిఐ బిఎస్ఎస్.ప్రకాష్ తెలిపారు. సిఐ కథనం ప్రకారం... జివిఎంసి 5వ వార్డు పరిధిలోని వైఎస్ఆర్ కాలనీ బ్లాక్ నెంబర్ 25 ఎఫ్ఎఫ్1లో వృద్ధురాలు కె.వరలక్ష్మి వద్ధిరాలు నివాసముంటున్నారు. ఈ నెల 2వ తేదిన గుర్తు తెలియని వ్యకి ఆ ఇంట్లోకి ప్రవేశించి ఆమె మెడలో ఉన్న రెండు తులాలు బంగారు గొలుసు తెంచుకొని పారిపోయాడు. ఆమె కుమార్తె వసంతి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తుచేపట్టారు. భీమిలి ప్రాంతానికి చెందిన ఆదినారాయణరెడ్డిని పట్టుకొని విచారించగా దొంగతనాన్ని అంగీకరించినట్లు సిఐ తెలిపారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

సుపరిపాలనపై టిడిపి నేతల ప్రచారం

ప్రజాశక్తి-జీకే వీధి

మండలంలోని తెలుగుదేశం పార్టీ ఏడాది సుపరిపాలనకు తొలి అడుగు అనే కార్యక్రమంలో భాగంగా గూడెం కొత్త వీధి మాజీ మండల కార్యదర్శి మామిడి నాగేంద్ర ఆధ్వర్యంలో సంక్షేమ పథకాల అమలుపై వివరించారు. పెన్షన్, తల్లికి వందనం, దీపం పథకం, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ వంటి పథకాలపై వివరిస్తూ ప్రచారం చేస్తున్నారు.సంకాడ పంచాయతీలోని డింగిరాయి, చిత్తమామిడి, కుమ్మరపల్లి, చినజడుమురు గ్రామాలలో ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు దేశగిరి గోవిందరావు, యూనిట్ ఇంచార్జ్ మామిడి చంటిబాబు, బూత్ ఇంచార్జ్ బుజ్జి పడాల్, పిసా కమిటీ అధ్యక్షులు ఉలం బాబురావు, కోశాధికారి దేశగిరి సంజీవ్ రావు, సహాయ కార్యదర్శులు గంగరాజు, రాధమ్మ పాల్గొన్నారు.

ప్రసవాలను తప్పనిసరిగా నమోదు చేయాలి

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగే ప్రసవాలను ఎప్పటికప్పుడు అప్లోడ్ చేసి అప్పుడే జన్మించిన శిశువులకు జనన ధ్రువపత్రాలు అందజేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విశ్వేశ్వర నాయుడు చెప్పారు.. మండల కేంద్రంలో ఆదివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాయంత్రం ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది రోజువారి హాజరు పట్టిక మందుల గదిని క్షుణంగా పరిశీలించారు. మలేరియా వ్యాధులు ఎన్ని నమోదయ్యాయి, ప్రసవాలు నెలకు ఎన్ని జరుగుతున్నాయి అనే దానిపై అడిగి తెలుసుకున్నారు.మాతా, శిశు మరణాలు జరిగితే చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా వ్యాప్త పిహెచ్సి లకు నిధులు కేంటయించడం జరిగిందన్నారు. ప్రసవాల అనంతరం జనన ధ్రువపత్రంతోపాటు ఎన్టీఆర్ బేబీకిట్లు అందజేయాలన్నారు. ఆరోగ్య ఉప కేంద్రాల్లో ఏఎన్ఎం హెచ్వీలు కచ్చితంగా అందుబాటులో ఉండాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

అనంతగిరి:మండల కేంద్ర స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రని అల్లూరి సీతారామరాజు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఆసుపత్రి పరి శుభ్రత సిబ్బంది పనితీరు. అనంతరం ఓపి రికార్డులను పరిశీలించారు. రోజువారిగా నమోదవుతున్న రోగులను బట్టి వైద్య పరీక్షలు నిర్వహించి సేవలందించాలని, వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చిన రోగులకు అందుతున్న వైద్యంపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మండల కేంద్రంతో పాటు ప్రముఖ పర్యాటక కేంద్రానికి సమీపంలో ఉన్న ఆస్పత్రి కావడంతో వైద్యులు అందుబాటులో ఉండి రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. గ్రామాలలో గిరిజనులకు వ్యాపించే చిన్న పాటి వ్యాధులను తెలుసుకొని వెంటనే వైద్య సేవలు అందించాలని. సూచించారు.

స్థానిక జెడ్పిటిసి గంగరాజు మాట్లాడుతూ, గర్భిణీ బాలింతలు, రోగులకు నిత్యం వైద్య సేవలు అందించడంలో కృషి చేస్తున్న సిహెచ్‌డబ్ల్యూలను ఆశా కార్యకర్తలుగా గుర్తించాలన్నారు. పనిభారం తగ్గించాలని, పిహెచ్‌సి పరిధిలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్య అధికారిని జ్ఞానేశ్వరి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రోగుల సమస్యలు తెలుసుకుంటున్న డిఎం అండ్ హెచ్ఒ, జెడ్పిటిసి గంగరాజు

పింఛను ఇప్పించరూ..!

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ రాళ్లగడ్డ గ్రామానికి చెందిన సిర్గం గురి (80) ప్రస్తుతం ఆమె ఒంటరి మహిళగా జీవిస్తోంది. భర్త కొన్నాళ్ల క్రితమే మృతి చెందారు. ప్రస్తుతం ఎటువంటి కూలి పనులు చేసుకోలేక ఇబ్బందులు పడుతోంది. పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని కోరింది. పింఛన్ కోసం సచివాలయం చుట్టూ తిరుగుతున్నా మంజూరు కాలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతోంది.



వాహన తనిఖీలు చేస్తున్న ఎస్ఐ కిషోర్‌వర్మ

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - కొయ్యూరు : వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కొయ్యూరు ఎస్ఐ కిషోర్‌వర్మ సూచించారు. తన సిబ్బందితో రాజేంద్రపాలెం వారపు సంత జంక్షన్ వద్ద ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. ప్రతీ వాహనాన్ని నిలిపి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. బైక్‌లు నడిపేవారు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్, ఇతర రికార్డులు ఉండాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని సూచించారు. ప్రతి వ్యక్తి మొబైల్ లో శక్తి యాప్ ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కొయ్యూరు మంప పోలీసులు పాల్గొన్నారు.



పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి

ఏడాదిలో చేసిన అభివృద్ధిని చూపండి

- మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి డిమాండ్

ప్రజాశక్తి - రంపచోడవరం : సంవత్సర కాలంలో చేసిన అభివృద్ధి ఏమిటో ఎమ్మెల్యే మిరియాల శిరీష చెప్పాలని మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి విమర్శించారు. ఆదివారం రంపచోడవరం స్థానిక శివాలయం వీధిలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ నాయకులు తనపై బురద చల్లేందుకు ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్యే శిరీష అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆమె ఎమ్మెల్యే కాకముందే అమాయకులైన గిరిజనులకు ఉద్యోగాలు ఇప్పిస్తామని కోట్ల రూపాయలు వసూలు చేసిన చరిత్ర ఉందని, అధికారంలోకి వచ్చిన తర్వాత అవినీతిలో టాప్ ఫోర్ జాబితాలో మిరియాల శిరీషదేవి కూడా ఉన్నారని, ఈ విషయాన్ని తాను చెప్పడం కాదని, వాళ్ల సొంతపత్రికలు, ఛానల్‌లోనే ఈ విషయం ప్రచురితమైందని ధనలక్ష్మి ఎద్దేవా చేశారు. ఇటీవల రంపచోడవరంలో ఒక గిరిజన ఉద్యోగి తన బదిలీ నిమిత్తం ఎమ్మెల్యేను కలవగా అతని వద్ద నుంచి లంచం డిమాండ్ చేశారని అతను స్థానికంగా ఉన్న ఒక ఐఎఎస్ ఉన్నతాధికారికి ఫిర్యాదు చేశారని అది తెలుసుకున్న ఎమ్మెల్యే ఫిర్యాదు నమోదు చేయకుండా పోలీసులతో సదరు ఉద్యోగిని రంపచోడవరం పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించారని విషయం తెలుసుకున్న ఉన్నతాధికారి ఏ కారణం చేత అతడిని స్టేషన్‌కు పిలిపించారని అధికారులను ప్రశ్నించారని దాంతో అతనిని వదిలేశారన్నారు. నియోజకవర్గాన్ని ఏం అభివృద్ధి చేశారో ప్రజలకు వివరించాలని ప్రశ్నించారు. సమావేశంలో ఎంపిపి బంధం శ్రీదేవి, ఎంపిటిసి ఉలవల లక్ష్మి, రంపచోడవరం మండలం వైసిపి అధ్యక్షుడు జల్లేపల్లి రామన్నదొర, గెద్దాడ సర్పంచ్ ప్రసాద్, మండల వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మన్యానికి జ్వరమొచ్చింది..!

- సీజనల్ జ్వరాలతో పాటు మలేరియా విజృంభణ
- సకాలంలో పిచికారీ చేయని దోమల నివారిణి మందు
- దోమ తెరలు పంపిణీ చేయకపోవడంతోనే తీవ్ర ప్రభావం

ప్రజాశక్తి- రంపచోడవరం : ఏజెన్సీలో జ్వరపీడితుల సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతోంది. వర్షాలు కురుస్తుండటంతో ఆదివాసీలు అనారోగ్యం పాలవుతున్నారు. మండలంలో మలేరియా, సీజనల్ జ్వరాలతో గిరిజనులు అల్లాడిపోతున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో మలేరియా, సాధారణ జ్వరాలు విజంభిస్తున్నాయి. ఈ సంవత్సరం వర్షాలు ప్రారంభం కాగానే మలేరియా కేసులు ఒక్క రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలోనే సుమారు 20 కేసులు నమోదయ్యాయి. సీతపల్లి పిహెచ్‌సిలో ఇప్పటివరకు ఒక్క కేసు మాత్రమే నమోదైంది. జ్వరాలతో రంపచోడవరం ఆస్పత్రికి ఓపి సాధారణ రోజుల్లో 100 నుండి 150 వరకు ఉంటుందని అయితే వర్షాలు పడడంతో ఓపి సంఖ్య గణనీయంగా పెరిగి సుమారు 400 నుండి 450 మంది వరకు ప్రతిరోజు ఏరియా ఆసుపత్రికి వస్తున్నారని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం రోజుకు పదుల సంఖ్యలో సీజనల్ జ్వరాలు వస్తున్నాయి. ప్రతి ఏడాది వర్షాలు పడ్డాక ముందుగా వైరల్ ఫీవర్లతో ప్రారంభమై ఒక్కసారిగా మలేరియా ప్రభావం చూపుతోంది. ఇప్పటికే రంపచోడవరం, సీతపల్లి ప్రభుత్వ ఆసుపత్రులు రోగులతో కిక్కిరిసి పోయాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో అనేకమంది గిరిజనులు చికిత్స పొందుతున్నారు. ప్రతి ఏటా వేసవిలో గ్రామాల్లో దోమలు వృద్ధి చెందకుండా మలేరియా నివారణ మందు పిచికారి చేయాల్సి ఉంది. అయితే ఇప్పటికీ పిచికారి చేయక పోవడంతో గ్రామాల్లో దోమల బెడద ఎక్కువగా ఉన్నట్లు గిరిజనులు ఆరోపిస్తున్నారు. జ్వరాలతో గిరిజనులు స్థానిక అర్ఎంపిలను ఆశ్రయిస్తున్నారు. ప్రతి రోజూ మెడికల్ క్యాంపులు నిర్వహించాల్సిన అధికారులు గ్రామాల్లో కానరాకపోవడంతో గిరిజనులు ప్రైవేటు ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. అయితే అధికారులు ఇప్పటి వరకూ ఒక్క కేసు కూడా నమోదు కాలేదని చెబుతున్నారు. ప్రతి ఏటా దోమలు కుట్టకుండా దోమతెరలు పంపిణీ చేసే వారని ఈ ఏడాది ఇప్పటివరకు పంపిణీ జరగలేదన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పరిసరాల పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని, మన్యం గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని గిరిజనులు వేడుకుంటున్నారు.




జ్వర పీడితులతో నిండిపోయిన రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వార్డు

జ్వరం వచ్చిన వెంటనే రక్తపరీక్ష చేయించుకోవాలి

రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో వివిధ రకాల జ్వరాలతో బాధపడే రోగులు సుమారు 50 మంది ఉండగా వారిలో సుమారు 20 మంది మలేరియాతో బాధపడుతున్న వారు ఉన్నారు. సాధారణ రోజుల్లో ఏరియా ఆసుపత్రిలోని వివిధ వ్యాధులతో వచ్చేవారి ఓపి 150 వరకు ఉంటుంది, అయితే అది ఈ సీజన్లో గణనీయంగా పెరిగి 400 నుంచి 450 వరకు పెరిగింది. ప్రజలు తమ ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వలు లేకుండా చూసుకోవాలి. మలేరియా వచ్చిన వారికి ప్లేట్‌లెట్ కౌంట్ తగ్గుతుంది. కనుక జ్వరం వచ్చిన వెంటనే రక్తపరీక్షలు చేయించుకుని మందులను వాడాలి. ఈ సంవత్సరం డెంగ్యూ కేసులు ఇప్పటివరకు ఏమీ నమోదు కాలేదు. జ్వరం వచ్చిన వారు వెంటనే ఆసుపత్రికి రావాలి.

- శేషారెడ్డి,
ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్





డాక్టర్ వినయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న జెడ్‌పిటిసి, తదితరులు

ప్రభుత్వ వైద్యునికి సన్మానం

ప్రజాశక్తి - కొయ్యూరు : కొయ్యూరు మండలం డౌనూరు పిహెచ్‌సిలో బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ కె.వినయ్‌కుమార్‌ని జెడ్‌పిటిసి సభ్యులు వారా నూకరాజు, డౌనూరు ఎంపిటిసి, వైసిపి మండల అధ్యక్షులు బిడిజాన అప్పారావు సన్మానించారు. డౌనూరు సిగ్మెంట్ పరిధిలోని గ్రామాలలో పర్యటించి, ప్రజలకు అందుబాటులో ఉండాలని డాక్టర్ వినయ్‌కుమార్‌ని వారు కోరారు. కార్యక్రమంలో వైసిపి స్థానిక సీనియర్ నాయకులు పండ్రా గంగరాజు తదితరులు పాల్గొన్నారు.



వృక్షాన్ని తొలగిస్తున్న స్థానికులు

కూలిన భారీ వృక్షం

ప్రజాశక్తి - సీలేరు: జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ ధారాలమ్మ ఘాట్‌రోడ్డు దారాలమ్మ ఆలయం దిగువ భాగం ప్రధాన రహదారిపై భారీ వృక్షం ఆదివారం కూలిపోయింది. దీంతో రాకపోకలకు రెండు గంటలపాటు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాహనాలు నిలిచిపోయాయి. అనంతరం భారీ వృక్షాన్ని తొలగించారు. దీంతో వాహన రాకపోకలు యధావిధిగా కొనసాగాయి.



మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ బొజ్జిరెడ్డి

గర్భిణులకు సామూహిక సీమంతాలు

ప్రజాశక్తి - రంపచోడవరం : దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గిరిజన పూజారులతో రంపచోడవరం పరిసర ప్రాంతాల్లో గిరిజన మహిళలు సుమారు 126 మందికి సామూహిక సీమంతాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం స్థానిక యూనియన్ బ్యాంక్ ఆవరణలో కార్యక్రమం నిర్వహించారు. ముందుగా భద్రాద్రి కొత్తగూడెం అనకాపల్లి సోమ ఆశ్రమ పీఠాధిపతులు అరుణానంద స్వామీజీ ఏకాదశి పరిస్కరించుకుని శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం సీమంతాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ బొజ్జిరెడ్డి, మాజీ శాసనసభ్యులు సీతంశెట్టి వెంకటేశ్వరరావు, దానధర్మా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు వెంకట్, సూర్య, రామకృష్ణ, కాటమరెడ్డి, గిరిజన పూజారులు కడపల మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఎన్‌హెచ్ఎం జెఏసి చైర్మన్ దయామణి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో 22 వేల మంది నేషనల్ హెల్త్ మిషన్‌లో ఉద్యోగులు 198 కేడర్లలో గత దశాబ్దన్నర కాలంగా పనిచేస్తున్నారని వారికి ఉద్యోగభద్రత కల్పించాలని ఎన్‌హెచ్ఎం జెఎసి చైర్మన్ దయామణి డిమాండ్ చేశారు. జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఆదివారం ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల జిల్లా సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న దయామణి మాట్లాడుతూ, ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు అత్యంత తక్కువ వేతనాలతో శ్రమ దోపిడీకి గురవుతున్నారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు మినిమం టైం స్కేలు (ఎంటిఎస్) ఒకే కేడర్ - ఒకే వేతనం అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, సమావేశానికి జెఎసి జిల్లా చైర్మన్ సురేష్ అధ్యక్షత వహించారు. ఎపి ఎన్‌హెచ్ఎం జెఎసి హానరరీ చైర్మన్ ఎ.వి.నాగేశ్వరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు లేబర్ కోడ్స్ రద్దు చేసి,12 గంటల పని విధానాన్ని కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల మెడకు ఉరికొయ్యలా తగిలించాలని చూస్తోందని ఆరోపించారు. లేబర్‌కోడ్స్ రద్దు చేయాలని ఈ నెల 9న తలపెట్టిన సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఎపి ఎన్‌హెచ్ఎం కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సెస్ ఫెడరేషన్ అధ్యక్షురాలు శిరీష ఎన్‌హెచ్ ఎం జిల్లా చైర్మెన్ సురేష్ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా జెఎసి హానరరీ చైర్మన్ శశిభూషణం, జిల్లా జనరల్ సెక్రటరీ బ్రహ్మం, వర్కింగ్ ప్రెసిడెంట్ మోహన్, నాగరాజు, శ్రీనివాస్, పుష్పేశ్వరావు, ఎన్‌హెచ్ఎంలోని అన్ని కేడర్ల ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి - రంపచోడవరం : మండలంలోని బూసిగూడెంలో గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఆదివారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం సంభవించింది. బచ్చల ఆదినారాయణకు చెందిన పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. ప్రమాద సమయంలో ఇంటిలో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పిందని గ్రామస్తులు తెలిపారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని ఆదినారాయణ కోరారు.



దగ్ధమైన పూరిల్లు